కథానిక

# పరీక్షలో అగ్నిపరీక్ష

వల్లూరి కృష్ణారావు

ఎప్పుడూ పరీక్ష తప్పి ఎరుగని శ్రీహరి బి. ఏ. పూర్తిగా అన్నిపార్టులూ తప్పాడని విన్నా విచారించలేదు. తాను బతకలేక బడిపంతులు చేయవలసి వచ్చినందుకు కుంగిపోలేదు. ఆఖరికి జిల్లా విద్యాశాఖాధికారి తనిఖీకి వచ్చినప్పుడు "నువ్వు వాజమ్మవి. నీకు చదువు చెప్పడం రాదు" అన్నాకూడా లెక్క చేయకుండా విద్యాశాఖాధికారి తెలివి తేటలు కాలవలేని చవలాయి అనుకొని ఆ ధోరణిని వదిలేసి చిన్న కుర్రాడిని పొట్టమీద పడుకోబెట్టుకొని కుర్చీలో కూర్చొని మామూలుగానే ప్రైవేట్లు చెప్పాడు ఆ రాత్రి. ఏ విషయమూ అంతగా ఖాతరుచేయని శ్రీహరికి ఒకరోజున పిడుగువచ్చి తనమీద పడినట్లయింది! తాను అస్థైర్య పడ్డట్టే బలిజేపల్లికి వాచరుగా వేయబడ్డాడు. శ్రీహరి గోచీకూడి భూమిమీద పడినా తెలుసుకోలేకపోయాడు పాపం! ఆ వేళ అంతా అదోమాదిరిగానే ఉండిపోయాడు. శ్రీహరి భయానికి తగ్గట్టు బలిజేపల్లి కుర్రాళ్ళు ఎంత రాక్షసమూకయిందీ వివరించి చెప్పారు సాటి పంతుళ్ళు. శ్రీహరి ఎంతో గుంభనంగా ఉన్నాడు. "ఆ! మరేం భయంలేద"న్నట్లు. కాని లోపల అదురుగానే ఉంది. "అః మనం జాగ్రత్తగా ఉంటే అదే పోతుంది" అనుకున్నాడు.

పరీక్షలు దగ్గర పడుతున్నకొద్దీ ఎక్కువ భయ పడుతున్నాడు ఎంత కాదనుకున్నా! దానికి సాయం పంతుళ్ళ ఓదార్పు వాక్యాలు. తెలుగు పండితులు చెప్పిన మాటలు కాస్త శ్రీహరికి నచ్చాయి.

"మీకు తెలియదు మాష్టారూ! ఉడుకు రక్తం. కుర్రతనం చేష్టలు చేయక మీదారిని మీరుండండి." ఇవి ఆయన మాటలు. అందులోని ఆంతర్యం శ్రీహరి గ్రహించకపోలేదు. "అలాగే ఉండాలి" అని ఒక నిర్ధారణకు కూడా వచ్చాడు.

హెడ్మాష్టరు కూడా చెప్పారు. "బలిజేపల్లి కాస్త చెడ్డఊరే అనుకో! అందుకని ఉద్యోగం మానుకుంటామా? ఇరవై ఏళ్లు 'ఆసిస్టెంటు' చేశాను. ఒకమాట ఎవర్నీ అనలేదు పడలేదు." కాస్త ఆయన స్వయాన్ని మింగిస్తూ దానిలోని తాత్పర్యాన్ని గ్రహించమన్నాడు. ఆయన మాటలు పునశ్చరణ చేసుకుంటున్నాడు. "ఉద్యోగం వదులుకుంటామా? "ఊహు!"

"మరి?...ఒకరిని మాటనలేదు. పడలేదు... ఔను. అంటే కదా పడడం?... అవును." హెడ్మాష్టరు అసలు విషయం చివరన చెప్పారు.

"అబ్బాయీ! మనం ఏదో కాస్త చూసీ చూడ...అయితే ఏమీ ఉండదనుకో." ఆయన చెప్పిన వాక్యంలోని కాళీ ఆయన చేతులుతిప్పడం కళ్లు చికిలించడం, పైకప్పుకేసి చూసి పకపక నవ్వడం పూర్తి చేశాయి!

బలిజేపల్లికి స్థలపురాణం ఉంది. బలిజేపల్లి గురించి వచ్చే కథలు ఎంతవరకూ నిజమయినవీ అని అనుమానమే పడితే చరిత్రనే నమ్మకూడదనిపిస్తుందేమో మరి! ఒక ఏడాది ఒక కుర్రాడు ఒక వాచరుని గుద్దుతానన్నాట్ట పబ్లికుగా పరీక్ష హాలులో! ఏముందీ...గుద్ది తీరాడు. అపరభీష్ముడు! ఇంకోమాటు ఇంకో భావిపౌరుడు ఇంకోహావాచరు డొక్క ఎముకల్ని ఏరి వాచరు ఇంటికి పంపించాడు భార్యను లెక్కపెట్టుకొని సరిచూసుకోమని! మరొకమాటు మరొక అమాయకుడిని సిరాతో జలకమాడించారు!

శ్రీహరి స్నేహితుడు విష్ణుమూర్తి శ్రీహరిని కూకలేసాడు. "ఏమిట్రా! పెద్ద గొడవ చేసుకుంటావు? అది నీకే లోకువకదా! గొడవ చేసుకోవడం మూలాన్న మరికొంత లోకువవుతావు. మెథవ్వి, గుంభితంగా ఉండు." అన్నాడు.

శ్రీహరి "నిజం" అనుకొని గుంభితంగా ఉన్నాడు. ఒక రోజున శ్రీహరిని డ్రాయింగు మాష్టారు ఓదారుస్తుంటే విరుచుకు పడ్డాడు శ్రీహరి. "నాకు తెల్సు. అయినా ఇందులో భయపడవలసిం

దేముందో నా కర్థం కాలేదు. అదీ చూస్తాను" అన్నాడు. సాటి పంతుళ్ళు శ్రీహరి ధైర్యానికి నివ్వెరపోయారు. వెనకాల ఒక బక్క గొంతు కీచుగా అంది "ఈ పై బింకాలకేంలే!" అని. శ్రీహరి విసురుగా క్లాసుకు పోయాడు.

పిల్లలు గొల్లుమన్నారు. శ్రీహరి ఒళ్ళు తడిమి చూసుకున్నాడు. "ఎందుకు?" అని గడ్డం ఉరిమి చూసాడు శ్రీహరి. ఒకడు "బ...బ" అనబోయాడు. శ్రీహరికి అర్థమైంది. తల తిరిగింది కూడా! తాగినవాడు అరచినట్టు "నోర్మూయ్యి!" అని వాడి నోరు మూసి తను మూసుకున్నాడు క్షణంపాటు.

* * *

ఉన్నట్టుండి ఒక రోజున శ్రీహరికి ఉత్తరం వచ్చింది. కవరు తెరచి లోపల కాగితం మడతలు తీసాడు. తీయడంతోటే ఎవరో పిలచినట్లు "శ్రీహరీ!" అని ఎడ్రస్సు చేయబడి ఉంది. ఎవరా ఇది వ్రాస్త అని క్రింద సంతకం చూసాడు... "కాపీరాయుడు...బలిజేపల్లి." శ్రీహరి ఒణికి పోయాడు. గబగబ చదువుతున్నాడు ఆ వాక్యాలని. చదివినా అర్థంకాని పరిస్థితిలో ఉన్నాడు.

"శ్రీహరీ...బలిజేపల్లి అంటే తెలుసా? సజావుగా ఉంటే బ్రహ్మరథం!...లేదా నువ్వు మళ్ళీ ఇంటికి వెళ్ళేదిలేదు. విల్లురాసి వచ్చేయి. ఎందుకైనా మంచిది."

శ్రీహరి విష్ణుమూర్తికి చదివి వినిపించి అలగోడు బాలగోడు మన్నాడు. విష్ణుమూర్తి శ్రీహరిని మామూలు పరిస్థితికి తెప్పించేసరికి చాలాసేపు పట్టింది.

ఆరాత్రి భయంకరమైన కలకూడా వచ్చింది శ్రీహరికి!

"మాష్టారూ! మాష్టారూ...ఆఖరిసారి సార్."

"వీల్లేదు. మీ బెదరింపులకు లొంగను."

"మాష్టారూ" అని అరిచాడు గట్టిగా. శ్రీహరి వణికిపోతూ అన్నాడు ధైర్యంగాచేసి.

"ఏయి అబ్బాయ్ ఇది పరీక్ష హాలు."

"నాకు తెల్సు మాష్టారూ. ఇంకెంత కాలం మాట్లాడతారు ఇలా!"

"అంటే!" శ్రీహరి బింకం ఇంకా సడలలేదు.

"ఏంలేదు. మీ 'టైం' కావలసి వచ్చిందిగా!" అందులోని ఇమిడియున్న భావం శ్రీహరికి అర్థం కాకపోలేదు.

పరీక్ష అయిన రాత్రి శ్రీహరిని తట్టిలేపింది ఒక యువక ఆకారం.

"శ్రీహరీ! నా జీవితం నాశనం చేసావు. నిన్ను నాశనం చేయందే నిద్రపోయేది లేదు."

"నేనేం చెసేది అబ్బాయి! నా డ్యూటీ నే చెయ్యొద్దా?"

"డ్యూటీ!" హుంకరించాడు. "ఎంత మంది చేయడంలేదు? శ్రీహరి ఒక్కడేనా?—నాతో వాదించకు."

ఇంతలో "నా కొడుకువంటి వాడివి నాయనా! నా పసుపు కుంకుమ నిలుపు తండ్రీ! ఆయన తప్పులను మన్నించు" శ్రీహరి భార్య బ్రతిమాలింది.

"హుం! అదికాదు." ఇంకా ఏదో అనబోయాడు.

"అన్నీ తెలుసు బాబూ! ఎత్తినచేయి దింపు!" అంది ఆవిడ. వెంటనే శ్రీహరికి మెలుకువ రావడం మూలాన్న ఆ అబ్బాయి ఏం చేసేదీ తనకు తెలియలేదు!

* * *

పరీక్షలకు బలిజేపల్లి వెళ్ళాడు శ్రీహరి. బలిజేపల్లి స్కూలు ఆవరణలోకి దిగేసరికి జవానువచ్చి చేతిసంచీ పుచ్చుకోని నమస్కరించాడు. "జవానులెంత విధేయులు?" అనుకున్నాడు శ్రీహరి. మేడ మెట్లు సమీపించేసరికి ఒక కుర్రవెధవను జబ్బ పుచ్చుకోని ముందుకు త్రోసి "వీడు నా కుర్రోడు బాబూ! రెండు మాట్లు తప్పాడు. మీదయ" అని వదిలేసి పంపించాడు ఆ కుర్రాడిని జవాను. శ్రీహరి జవాన్ని ఓరగాచూసి చకచక నడిచాడు.

మేడమెట్లు ఇంకా ఎక్కడం పూర్తి చేయకుండానే "నమస్కారం. మాష్టారూ!" అన్నాడు ఒకాయన.

"శర్మగారా?"

"అనుకున్నాను ఈ సరికి రావాలని." అన్నారు శర్మగారు.

"తమ రిక్కడే ఉంటున్నారా?"

"లేదు. మా చెల్లెలుగారు ఉంటున్నారు. మేనల్లుడు పరీక్షలూ. "రమ్మని వ్రాసాడు బావ.

ఓరే అబ్బీ!" అని కేకపెట్టాడు. ఆ కుర్రాడు మెట్లను మూడు అంగల్లో ఉరికి శ్రీహరిని చూసి బిక్కచచ్చిపోయాడు.

"వీడేనండి. బాగానే చదువుతాడు గాని కాస్త భయం వెధవకి. భయం లేదురా అబ్బీ! మన మాష్టారే! వస్తాను మాష్టారూ!" రెండు మెట్లు దిగి మళ్ళీ క్షణంలో మాష్టారును సమీపించి... "ఇదో మాష్టారూ! అసలు విషయం మరిచాను. మీ బస మా ఇంట్లో ఏర్పాటు చేసాను."

శ్రీహరి నవ్వుతూ "ఏర్పాట్లన్నీ అయిపోయా యన్నమాట! క్షమించండి. నేను రాలేను."

"ఏం!"

"బంధువు లున్నారు."

"హోటలు వాళ్ళేనా?" ఫక్కున నవ్వారు శర్మగారు.

"దానికేం గాని మరోమాటు." అన్నాడు శ్రీహరి.

"వీల్లేదండోయి. మీరు రావాల్సిందే!" శర్మ గారు బలవంతం చేసారు.

"సరే చూస్తాను" అని శ్రీహరి పైకివెళ్ళి పోయాడు. శర్మగారు ఎంతో తేలిగ్గా, గాలి పీల్చు కొని గుమిగూడిన కుర్రమూకను "చూడండిరా నా ఇది." అన్నట్లు వాళ్ళను చూచి, వాళ్ళను తప్పించుకొని వెళ్ళిపోయాడు. ఇక అబ్బి సాటి కుర్రాళ్ళ ఎదుట కాలరు పైకెత్తి తన కొచ్చిన 'రసిబేవను' పద్యాన్ని గట్టిగా చదవ సాగాడు.

శ్రీహరి శర్మగారి మాటలులోని "కాస్త భయం వెధవకి. భయంలేదురా అబీ! మన మాష్టారే. వస్తాను మాష్టారూ" అంతరార్థం, మేనల్లుడికి ధైర్యం, ప్రోత్సాహం, శ్రీహరిని "కాస్త మన వాడండోయి, మీరు కాస్త అటూ ఇటూ ఉండాలి" అన్నట్లున్న ధ్వనీ అర్థమయ్యాయి.

శ్రీహరి మేడమెట్లన్నీ ఎక్కి సరాసరి 'చీఫ్' గదిలోకి వెడుతుండగా "శ్రీహరీ!" అని పెద్దగా పిలుపు వినబడ్డది. 'ఎవరా పిలచినదని' ఆలో చిస్తుండగానే—

"బ్రహ్మ రథం..లేదా..,ఏదీ..కాపీ రాయుడు." అన్న మాటలు తిరిగి వినిపించాయి. శ్రీహరికి నిజంగా చమటలు పోసాయి. కాళ్ళ పట్టు తప్పు తున్నట్లనుకున్నాడు. అయినా ధైర్యంగా—

"బ్రహ్మ రథమే. విల్లురాసి రాలేదు"అన్నాడు కొంచెం గట్టిగా. అక్కడక్కడ వెదజల్లినట్లున్న పిల్లలు ఈ మాట వినడంతోటే ఆశ్చర్యపోయారు. ఎంతగానో జడిసి,కుదేలవుతాడాని ఊహించినపిల్లలు శ్రీహరి వాళ్ళమాటలయందు అలక్ష్యం చూపడం ఆశ్చర్యమే కలిగించింది. శ్రీహరి రెండు అడుగులు వేసేసరికి ప్రక్క గదిలోంచి బిలబిల మంటూ పది మంది కుర్రాళ్లు వచ్చారు.

అందులో ఒక యువకుడు ముందుకువచ్చి శ్రీహరినుద్దేశించి మాట్లాడబోయాడు. వాడి రౌడీ ఆకారానికి, మాటల ఉచ్చారణలోని కాఠిన్యానికి అసహ్యించుకున్నాడు శ్రీహరి. కాని ద్వేషాన్ని, అసహ్యాన్ని లోపల దాచుకొని కొన్నిచోట్ల పంచ దార తిన్న నోటితో మాట్లాడినట్లు మాట్లాడాలి. అదే చేశాడు కూడా శ్రీహరి.

"మాష్టారూ! ఏదో తెలియక అందరికీ రాసి నట్టు మీకూ వ్రాశాం, క్షమించండి." ఆ మాటలు అనడానికి ఎంతో మరణయాతన పడ్డాడు. తలకి మఫ్లరు చుట్టాడు. బలిష్టమయిన కండలు. విరచి ఉబ్బిన ఛాతి. రుష్ప్రాఫింగ్. ఏ పంతులునైనా గుద్దుకు చంపేయగలను అని అర్థంచెప్పే అతని కళ్ళు. శ్రీహరి అతన్ని బాగా పరిశీలించి చిరునవ్వు నవ్వి—

"ఏంలేదు. తెరచాప మార్చారు గాలినిబట్టి నేను కూడా అదే చేస్త. సరే వస్తాను." అని వెళ్ళి పోయాడు ముందుకు.

పరీక్ష లయిపోవస్తున్నాయి. ఆఖరి రోజున ఏమో శ్రీహరి మేడమెట్లు దిగుతుంటే ఆ 'మఫ్లర్' అబ్బాయి—

"మాష్టారూ!" అని పిల్చాడు.

"నువ్వా?" శ్రీహరి ఆశ్చర్యపోయాడు.

"ఏంలేదు మాష్టారూ! అంతా మంచివాళ్ళే."

"అంటే అర్థం తెలుసా! అవును మంచివాళ్ళే"

"మీరు రావడం లేదేం సార్?"

"వెయ్యలేదు."

"మా దురదృష్టం సార్."

"నా అదృష్టమేమో! వస్తాను నాయనా! జాగ్రత్తగా రాయి ఈ పరీక్ష కూడా" అని వెళ్ళి పోయాడు శ్రీహరి.

పరీక్ష అయిపోయాయి. శ్రీహరి తిరిగివచ్చాడు.

సాటి పంతుళ్ళు చుట్టుముట్టి "ఎలాగుందండీ! ఏమయిందండీ? ఏమిటండీ విశేషాలు?" అని ఒక్క పెట్టున మృత్యు ముఖంనుండి తప్పివచ్చిన అదృష్టవంతుణ్ణి అడిగినట్టు అడిగారు. ఇంతలో శ్రీహరితో స్నేహంగా ఉండే మాష్టారు అన్నారు వెనకనుంచి:

"ఇంతకీ ఆవిడ తాడు గట్టిది" నవ్వుతూ. అంతా నవ్వారు. దానికి శ్రీహరి ఎంతో తాపీగా ఏమీ భయం అంటే ఎరగనివాడిలా అన్నాడు:

"బలిజేపల్లి అంటే ఎందుకు మీరు అంతగా భయపడుతున్నారో నా కర్థంకాదు. వాళ్ళంత మంచిపిల్లలు మన స్కూలు పిల్లలు కూడా కారు."

"నిజంగానా?" అని ఆశ్చర్యపోయారు.

ఆ సాయంత్రం శ్రీహరి విష్ణుమూర్తి యింటికి పోయి విష్ణుమూర్తితో అన్నాడు—

"ఒరే! పాపం! ఆయన 'రిలీఫ్' లోనే వేసాడ్రా! నీ మేలు మరవను."

"ఇందులో ఏముంది పెద్ద! మా పెద్దనాన్నా, మీ చీఫ్, మనం ఇద్దరం ఎలా ఉంటామో అలా ఉంటారు. కాస్త ముక్కేగా చెప్పాడు అంతే." శ్రీహరి అక్కడ జరిగిన ఒకటి రెండు విశేషాలు చెప్పి చివరన అన్నాడు:

"కాని విష్ణూ! చాలామందిని మోసం చేశాను."

"కాదురా! మోసపోయారను!" విష్ణువు నవ్వుతూ అన్నాడు.

---

కథానిక

# పాఱువేట

"రత్నం"

ఒక్క కునుకు తీద్దామని పక్కమీద అటూ — యిటూ దొర్లటం తప్పితే ఎంతసేపటికీ నిద్ర పట్టటంలేదు రామిరెడ్డికి. చుక్కపొడిచినప్పుడు అరక గట్టుకొని తెగులు పడిన మిరపచేను పగల దున్ని అలసి—సొలసి వచ్చాడు యింటికి.

ఊహ తెలిసిన దగ్గర్నుంచీ ఈ ఇరవైయేళ్ళ వయసుదాకా పొలం...గొడ్లూ చాకిరీ—ఇవే రామిరెడ్డికి తెలిసింది. అతనిలాగా ఆ వయసులో తిన్నగా కొండ్రవేసే వాళ్ళు ఎవళ్ళూ లేరని చుట్టుపక్కల పేరు. తీరిగ్గా నడుంవాల్చేది పండుగా పబ్బాల్లోనే ఆ ప్రాంతం రైతు. ముందు జొన్న అది పాడయితే వరిగ...లేకపోతే మిర్చి...ఆ తర్వాత శనగ...కొత్తిమిర ఆరుగాలం ఏదో ఒక పైరు వెయ్యాలి. దున్నిన సాళ్ళే నాలుగయిదు సార్లు దున్ని...గొఱ్ఱు పన్నివిత్తి గుంటక యీడ్చి చదుచేసి...లేతపైరు మధ్య దంతెతో మళ్ళా దున్ని ఎంతో శ్రమపడాలి. అదనుకు వర్షాలు కురిస్తే...గాలిపాటు సరిగ్గా ఉంటే భూమాత పసిడిపంట నిస్తుంది. నాలుగు వేళ్ళూ లోపలికి పోతాయి. ప్రకృతి ఉత్పాతాలకు గురయి తమ కష్టఫలితం దక్కకపోయినా...శతాబ్దాలనుంచి ఆ యీతిబాధలకు అలవాటు పడిన రైతులు ఒక్క నిట్టూర్పన్నా విడవరు. మళ్ళా పగల దున్నటం...ఇంకో పైరు వేయటం...శ్రమ...ఉత్త శ్రమ! అదే తెలిసింది వాళ్ళకి!

వరిగబువ్వలో ఇంత గోంగూర పచ్చడేసుకొని గడ్డ పెరుగుతో జుఱ్ఱి...ఊరు మాటుమణక్క ముందే...నులక మంచంమీద గడ్డిదిండేసుకొని...నడ్డివాల్చి గుఱ్ఱుకొడుతుంటే రోజూ ఎటుపోయేదో ప్రాణం! కాని యివ్వాళ ఎంత తన్నుకున్నా మగతనిద్ర తప్పితే సరిగ్గా నిద్రపట్టటంలేదు రామిరెడ్డికి.

ఆ కోడినిద్రలో ఎన్నో ఆవేశ భావాలు...తియ్యతియ్యని కలలు...ఈయేడు కూడా పాఱువేటలో గెలిచినట్టూ...గొఱ్ఱెను భుజాన వేసుకొస్తూంటే...బావా...! బావా...!—అంటూ సీతాయి తనవంక పులుకుపులుకునా చూసినట్టూ—ఎన్నో అనుభూతులు! మెలిదేరిన కండలు...